తేదీ. 15-09-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము

# భగవంతుని అవతరణ ప్రేమను అభివృద్ధిపరచే నిమిత్తమే!

srisathyasaivachanamrutam

**ప్రేమస్వరూపులారా!**

భగవంతుడు అద్వితీయుడు, అప్రమేయుడు. అతనిని వర్ణించుటకు ఒక ప్రమాణము అక్కరలేదు. సర్వత్రా వున్నది సర్వేశ్వరుడే! రెండవ పదార్థము వుండినప్పుడే పోలిక అనేది జరుగుతుంది. రెండవ పదార్థమే లేదు. 'ఏకమేవ అద్వితీయం బ్రహ్మ.' ఇట్టి భగవత్ తత్వాన్ని గుర్తింపచేసే నిమిత్తమై 'ఏకోహం బహుస్యాం' అని తనకు తాను సంకల్పించుకున్నాడు, దేవుడు తన సంకల్పము చేత తనకు తాను సర్వ రూపములతో వచ్చాడు. అన్ని మతములుకూడా ఈ సత్యాన్ని ఒప్పుకున్నవి. బైబిలునందుకూడా God created man in his own image అని వున్నది. ఈ ఏకత్వమునుండే అనేకత్వమన్నది ఆవిర్భవించింది. దేవుడు ఒక్క మానవునకు మాత్రమే ప్రకృతిని వశము చేసుకొనే శక్తి సామర్థ్యము లందించాడు. ఇట్టి విజ్ఞానము మానవునియందు వికసిస్తూ పోగా మానవునందు పశుత్వము క్షీణించి, సభ్యత సంస్కృతికూడా అభివృద్ధి అవుతూ వచ్చింది.

భగవంతుడు మానుషరూపుడై అవతరిస్తాడు. దైవం మానుష రూపేణ. మానవుడనగా ప్రాకృతికమైన యింద్రియములు, ప్రాణము, సంస్కృతులచేత ప్రకటితమయ్యేవాడని మాత్రమే మనము భావించరాదు. భారతీయ సంస్కృతి ఏ విధమైన మార్పులులేక, నిత్యసత్యమై రాణించేటువంటిది. కాలముచే మారక, ప్రళయముచే నశించక, సృష్టిచే పెరిగి తరగక యే సత్యమైతే వున్నదో ఆ సత్యమునకు రూపకల్పనే భారతీయ సంస్కృతి. ఇట్టి సంస్కృతికి అంతర్వాహినియై ప్రవహించునదే సనాతన ధర్మము.

**ప్రేమ అనేది భగవంతుని పొందే నిమిత్తమై ప్రవహించేది**

భారతీయ సంస్కృతి భక్తి ప్రధానమైనదిగా, ప్రమాణమైనదిగా నిరూపించినది.

దేవాలయములకు వెళ్లటము, నమస్కరించటము, తీర్థయాత్రలు గావించటము యిత్యాది కర్మలద్వారానే భక్తిని సాధించటానికి వీలుకాదు. ఇవన్నీ భక్తికి సంబంధించిన కొన్ని చర్యలు మాత్రమే! కాని అన్నింటికి ఆధారమై, అన్నింటిని పోషించి, అన్నింటియందు ప్రసరించి, అన్నింటినీ ప్రభవించే శక్తి ఒకటి వున్నది. అదే పరిపూర్ణమైన ప్రేమ. ఈ ప్రేమ యెట్టి కారణములకు సంబంధించనటువంటిది. నది సముద్రమును చేరుటకు యేవిధమైన సహజ వృత్తిని అనుభవించుచున్నదో, లత యే విధముగా స్వతస్సిద్ధముగా వృక్షమును అల్లుకొనుటకు ప్రయత్నించునో అదేవిధముగా ప్రేమ అనేది భగవంతుని పొందే నిమిత్తము ప్రయాణమయ్యేదేగాని ప్రాకృతమైన వాంఛలతో కూడినది కాదు. ఇట్టి పవిత్రమైన ప్రేమతత్త్వాన్నే భాగవతము ఆనాడు ప్రపంచమునకు చాటినది. పరమాత్ముని సన్నిధి అనే పెన్నిధిని అనుభవించే నిమిత్తమై, ప్రేమ నిస్వార్థమైన ప్రేమగా ప్రవహిస్తుంది. భగవంతుడు తప్ప నాకు కావలసినది అన్యము లేదని విశ్వసిస్తుంది. సర్వత్రా వున్న భగవత్ తత్త్వము ఏకత్వమని భావిస్తుంది. 'ఏకోహం బహుస్యాం' అనే సత్యాన్ని ఆదరిస్తుంది. సర్వపదార్థములుకూడా భగవంతుని నిర్ణయములే! నామ రూపములన్నీ భగవంతుని ప్రభావములే! కాని, దీనిని మానవుడు వేరువేరుగా భావించి విభజించటముచేత బాధలకు గురౌతున్నాడు. దీనికి కారణము, అహంభావమే!

**అహము నిర్మూలమైనప్పుడే ఆత్మతత్త్వము అర్థమవుతుంది**

అహం భావమున్నచోట భగవంతుడు కానరాడు. 'అహము చచ్చెనేని పరమాత్మ'వచ్చు! ఈ అహము ఆత్మతోకూడిన, అదియె ముక్తి. అనగా ఆత్మనుండి అహము వుద్భవిస్తున్నది. అహమునుండి తలంపు ప్రారంభమవుతుంది. ఈ తలంపు నుండి వాక్కు బయలుదేరుతుంది. ఇవన్నీ ఆత్మనుండి ఆవిర్భవించినవే! అహము లేకుండా ఆత్మ వుండవచ్చునుగాని, ఆత్మలేక అహము వుండుటకు వీలులేదు. అహము నిర్మూలమైనప్పుడే ఆత్మతత్త్వము అర్థమవుతుంది. అహం అనేది కేవలము భ్రమ మాత్రమే. ఈ భ్రమ మానవుని కట్టి వేస్తున్నది.

ఈ సమస్త ప్రపంచము ఆత్మనుండే ఆవిర్భవించింది. ఆత్మయందే జీవించుచున్నది. ఆత్మయందే లయమగుచున్నది. బ్రహ్మ సూత్రమునందు 'తత్ జలాన్' అని సూత్రము వుంది. 'తత్' అనగా దాని నుండి 'జ' అనగా పుట్టటము. 'ల' అనగా లయము కావటము. 'అన్'

అనగా పోషించటము. కనుక 'తత్ జలాన్' అనగా దానినుండే పుట్టి దానినుండే పెరిగి దానిలోనే లయము కావటము. మానవుడుకూడా బ్రహ్మయందే పుట్టి, బ్రహ్మలోనే పెరిగి, బ్రహ్మలోనే లయమగుచున్నాడు. ఈ విధముగా ఏకత్వాన్ని ప్రపంచమునకు చాటే నిమిత్తమై కర్మ, ఉపాసన, జ్ఞానము, అనే మార్గములను కనిపెట్టి భగవత్ సృష్టి రహస్యాన్ని ప్రపంచమునకు తెలియచేయటానికి పూనుకోవటమే ఆధ్యాత్మికముయొక్క ధ్యేయం.

**భగవంతుడనే ఒకే విత్తనమునుండి ప్రకృతి అనే విశాలమైన వృక్షము అభివృద్ధి చెందింది**

అనేకత్వమునుండి ఏకత్వాన్ని భావించి, ఈ ఏకత్వములోపల ఆత్మ తత్వాన్ని దర్శించి ఆనందము అనుభవించటమే మానవుని ప్రధాన కర్తవ్యము. భజనలు చేయటమే భక్తి కాదు. ధ్యానము, భజనలు, యోగము, తపస్సు యివన్నీ భక్తికి ఉపాంగములే కాని యివే భక్తికాదు. రెండవ పదార్థమును ఆశించినదే భక్తి. తాను తానై బ్రతికేటువంటిదే భక్తి. అనేకత్వముగా గోచరించుచున్నప్పటికి దీని కన్నింటికి ఆధారమైన మూలము ఒక్కటి వున్నది. ఒక విత్తనం నాటినప్పుడు అది మొక్కగా బయలుదేరి తదుపరి పెద్ద వృక్షముగా వస్తుంది. ఆ వృక్షమునందే అనేకమైన కొమ్మలు, రెమ్మలు, ఆకులు, పువ్వులు ఏర్పడుతుంటాయి. ఇవి బీజము లోపలే అణుమాత్రముగా నిలిచివున్నాయి. దీనిని పురస్కరించుకొనే గీతయందు 'బీజం మాం సర్వభూతానాం' అని చెప్పబడివున్నది. ఒక విత్తనము నాటినప్పుడు అది వృక్షముగా అభివృద్ధి పొందుతుంది. ఆ వృక్షములో ఆకులు, పువ్వులు, కాయలు ఫలములు అనేకముగా కాస్తుంటాయి. తిరిగి ప్రతిఫలమునందు ఒక విత్తనము ఏర్పడుతుంది. అదేవిధముగానే భగవంతుడు అనే ఒకే విత్తనమునుండి ప్రకృతి అనే విశాలమైన వృక్షము అభివృద్ధి పొందింది. ఈ వృక్షములోపల సంబంధ బాంధవ్యములు కొమ్మలు రెమ్మలుగా అయిపోయినవి. ఇందులో మనభావములు పుష్పములుగా యేర్పడుతున్నాయి. మన జీవితము ఒక ఫలముగా రూపొందుతుంది. అయితే ప్రతి జీవుడూ ఆ ఫలమునందు విత్తనముగా చేరి వుంటాడు. అదే సంకల్పమువలన సర్వముకూడా భగవంతుని ఆకారముగా రూపొందుతూ వచ్చాయి. ప్రాకృతముగా అనేకరూపములు వుండినప్పటికి భావరీతిలో మనము ఏకత్వము అనుభవించటానికి ప్రయత్నించాలి.

**సుఖమునందు భగవంతుని స్తుతించటము, దుఃఖమునందు భగవంతుని దూషించటము సరికాదు**

"భగవంతుడా! నీకంటె అన్యముగా జీవించుటకు వీలుకాదు. నేను నీతోనే కూడి వుండాలి. నీతోనే ఆడి, పాడి నీతోనే జీవితాన్ని అంతము చేసుకోవాలి." ఇటువంటి భావములు పరమభక్తికి చెందిన గుర్తులు. ఇలాంటి పరమభక్తికి సంబంధించిన సాధకులు అభివృద్ధి చెందాలి. సుఖమునందు భగవంతుని వర్ణించటము, కష్టమునందు భగవంతుని దూషించటము ఈ విధమైన భేదభావములను మనము ప్రదర్శించరాదు.

భాగవతమునందు గోపికలకు, భారతమునందు పాండవాగ్రజుడైన ధర్మజునకు మాత్రమే యిట్టి భక్తి అభివృద్ధి చెందుతూ వచ్చింది. ఎన్ని కష్టములు వచ్చినప్పటికి, ఎన్ని అవమానములు అనుభవించినప్పటికి, కృష్ణుని విషయములో తాను యేమాత్రము సందేహ పడలేదు ధర్మరాజు. అడవులందున్నా, పట్టణములందున్నా, ఎక్కడున్నా 'నీవే నాకు దిక్కు', అన్న ఆశయాన్ని ఆధారం చేసుకున్నాడు.

**అడవులందున్న ఆకసముననున్న**
**పట్టణముననున్న పల్లెనున్న**
**గుట్టమీదనున్న నట్టేటనేవున్న**
**దిక్కునీవే కృష్ణా!**

ఇట్టి ఏకైక ప్రేమతో కూడినవాడు కనుకనే అతడు ధర్మబద్ధమైన జీవితాన్ని యితరులకు అందించగలిగాడు.

**భగవంతుని అవతరణకు కర్మలు ఆధారము కాదు**

భగవదవతారములు కొన్ని కారణములు పురస్కరించుకొని వస్తాయి. మానవుని జన్మకు, కర్మ కారణము. ఈ కర్మకు ఆధారమైన జన్మయే మనకు లభిస్తుంది. అయితే ఎవరి కర్మను వారు పురస్కరించుకొని ఆయా రూపములను ధరించవచ్చు. 'కర్మానుబంధీని మనుష్యలోకే' అన్నారు. ఐతే, "భగవంతుడు మానవాకారమును ధరించుటకు చేసిన కర్మ ఏమిటి?" అని కొంతవరకు మనము సందేహించవచ్చు. భగవంతుని అవతరణకు కర్మలు కాదు, ఆధారము. అయితే దుష్టులు చేసిన పాపములు, సజ్జనులు చేసిన పుణ్యములే దీనికి మూలకారణము.

srisathyasai vachanamrutam

ప్రహ్లాదుడు పొందిన భక్తి ప్రపత్తులకు, హిరణ్యకశిపుడు అనుభవించిన దుర్గుణములకు కారణముగా నరసింహావతారము వచ్చింది. భగవదవతారమునకు ప్రాకృతముగా జీవించే భావములే కారణములుగాని కర్మలు కారణము కాదు.

సస్యములు నీటి నిమిత్తమై అనేక విధములుగా కాచుకొని వుంటాయి. మేఘములు వర్షించేవరకు ఈ మొక్కలు అభివృద్ధి కావు. నిరంతరము నీటి చింతనే చేస్తూ, నీటినే ఆశ్రయించే భావముతో వుండటముచేత మేఘములే వర్ష రూపములో క్రిందకు దిగి సస్యములను పోషిస్తూ వుంటాయి. అదేవిధముగా భక్తులను పోషించి, రక్షించి, ధర్మాన్ని స్థాపించే నిమిత్తమై భగవంతుడు క్రిందకు దిగివస్తాడు. దానినే అవతరణ అన్నారు. అనగా క్రిందకు రావటము. తన వున్నతమైన స్థితిని విడిచిపెట్టి మానవులను రక్షించే నిమిత్తమై వారిని సంతోషపెట్టే నిమిత్తమై తాను క్రిందకు దిగుతూ వుంటాడు. ఇలాంటి పవిత్రమైన రహస్యములను గుర్తించుటకు మానవులు ప్రయత్నించటం లేదు.

### భక్తికి మించినది మరొకటి లేదు

భక్తికి మించినది ఈ జగత్తున లేదు. ఒకానొక సమయములో నారదుడు తన శిష్యులకు ఉపదేశమిస్తూ, భక్తికి మించినది మరొకటి లేదని అన్నాడు. అందులో ఒక విద్యార్థి లేచి 'గురువుగారూ! పంచభూతసమన్వితమైన జగత్తునందు భూమి చాలా పెద్దది కదా! ఈ భూమికంటె భక్తి పెద్దదా?' అన్నాడు. 'నిజమే! యింత పెద్దదైన భూమిని జలము మూడు భాగములు మింగివేసింది. ఇప్పుడు భూమి పెద్దదా జలము పెద్దదా?' అని నారదుడు అడిగాడు. శిష్యుడు జలము పెద్దదని అన్నాడు. ఐతే ఈ జలమును ఆగస్త్యముని ఒక గుటకలో త్రాగినాడు. అగస్త్యుడే గొప్పవాడని శిష్యుడన్నాడు. 'ఇంత గొప్పవాడైనా అగస్త్యుడు ఆకాశములో చిన్న చుక్కమాదిరి వున్నాడు' అన్నాడు నారదుడు. 'ఆకాశమే గొప్పది స్వామీ' అన్నాడు శిష్యుడు. అయితే వామనావతారములో వచ్చినప్పుడు మూడు అడుగుల భూమిని వామనుడు కోరాడు. ఒక్క అడుగులో భూమిని ఆక్రమించాడు, రెండవ పాదముతో ఆకాశమును ఆక్రమించాడు. 'ఒక్క పాదముతోనే ఆకాశమును ఆక్రమించినప్పుడు భగవంతుని పాదము గొప్పదా, ఆకాశము గొప్పదా' అని నారదుడు ప్రశ్నించాడు. భగవంతుని పాదమే యింత గొప్పదిగా వుండినప్పుడు

srisathyasaivachanamrutam

భగవంతుడే గొప్పవాడని అన్నాడు. 'ఇంత గొప్పవాడైన భగవంతుని, భక్తుడు తన హృదయములో కట్టివేస్తాడు. కనుక భగవంతుడు గొప్పవాడా భక్తుని హృదయము గొప్పదా?' అని ప్రశ్నించాడు. భక్తి గొప్పదని చెప్పాడు, శిష్యుడు.

భక్తికంటె మించిన పరమ ఔషధము మరొకటి లేదు. ఈ జగత్ సంబంధమైన సర్వరోగములు నివారణ చేసేటువంటిది భక్తి. ఈ భక్తికంటె మించిన వేదశాస్త్రములు లేవు. భగవంతుని చేరే నిమిత్తమై సర్వము త్యాగము చేయవలసి వస్తుంది. ఇలాంటి అనంతమైన భక్తితత్త్వాన్ని ప్రపంచానికి నారదుడు చాటాడు.

**మహా తెలివిగలవాడు కనుక గణపతికి ఏనుగు శిరస్సును పెట్టారు**

భారతీయుల పర్వదినములన్నికూడా అంతరార్థములతో కూడిన ఆధ్యాత్మిక ఆచరణలే! భారతీయులు ప్రతి పర్వదినమునుకూడా భగవన్మయమైనదిగా భావిస్తూ వచ్చారు. ఆనాడు వంటిని, యింటినికూడా పరిశుభ్రపరచుకొని, ప్రత్యేకమైన పూజలను సలిపి, కొబ్బరి కాయలను కొట్టి అనేక రకములైన దైవకార్యములచేత ఆ దినమును సద్వినియోగము చేస్తుంటారు. ఈనాటి పర్వదినముయొక్క రహస్యాన్ని అనేకులు అనేక విధములుగా వర్ణిస్తూ వుంటారు. మానవుని తలకు ఏనుగు తలపెట్టటానికి వీలవుతుందా? దానికి ఒక అంతరార్థము వుంటున్నాది. మహా తెలిగలవాడు కనుక గణపతికి ఏనుగు శిరస్సును పెట్టారు. గజ తెలివి అనేపదము మనము ఉపయోగపెడతాము. అందుకోసమే గణపతిని బుద్ధి వినాయక, సిద్ధి వినాయక అని అంటున్నాము. వినాయకుడనగా ఆశ్చర్యకరములైన పనులు చేయించే నాయకుడు. అతడు గొప్ప తెలివితేటలు కలిగినటువంటివాడు. అతడు అన్ని గణములకు నాయకుడు. రుద్రగణములకు, భద్రగణములకు యింకా అనేక గణములకు యితడు నాయకుడుగా నిల్చాడు. అందువలన యితన్ని గణనాయకుడని, గణపతి అని అన్నారు.

గణపతి తెలివికి సుస్వరూపుడని అర్థము. మహాభారతము వ్రాయుటకు పూర్వము వ్యాసుడు గణపతిని ప్రార్థించాడు. అప్పుడు గణపతి "నీవు చెప్పినది నేను వ్రాస్తాను. కానీ నీవు మధ్యలో ఆపి కాలమును వ్యర్థము చేస్తివా నేను దీనిని వదలిపెడతాను", అన్నాడు. వ్యాసుడు చెబుతూ వస్తున్నాడు. గణపతి ఒక్క క్షణములో వాటిని వ్రాస్తున్నాడు. ఇతన్ని తృప్తిపరచే నిమిత్తమై అనేక

విధములైన శ్లోకములను చేకూరుస్తూ వచ్చాడు వ్యాసుడు. గణపతికి కొంత విరామము చేయాలని ఉద్దేశ్యముతో వ్యాసుడు, వ్యాసునకు చెప్పకుండా చేయాలని గణపతి పట్టుపట్టారు. ఈ భారతము 100 కోట్ల శ్లోకాలుగా వ్రాసారు. పూర్తయిన తరువాత దానిని చూస్తే అది సామాన్యమైనది కాదని తెలుసుకున్నారు. భారతము సాక్షాత్తూ పంచమ వేదము. అద్భుతమైన అగమ్యమైన విషయాలను దానిలో చేర్చారు. ఇట్టి పవిత్రమైన భారతాన్ని మానవులు, దేవతలు, దానవులు అనే భేదం లేకుండా అందరూ అనుభవించాలని భావించారు. ఈ 100 కోట్ల శ్లోకాలను మూడు జాతులవారికి సమానముగా పంచేసరికి ఒక్క శ్లోకం మిగిలింది. ఈ శ్లోకములో 32 అక్షరాలు వుంటున్నాయి. వాటిలో ఒక్కొక్కరికి 10 అక్షరాలు యిచ్చాడు వ్యాసుడు. ఇంకా రెండు అక్షరాలు మిగిలాయి. ఈ రెండు అక్షరాలే హరి, హర, రామ, కృష్ణ, సాయి అని గణపతి చెప్పాడు. అలా మిగిలిన రెండు అక్షరాలే దైవనామముగా మిగిలాయి.

### ప్రకృతి అంతా భగవంతుని స్వరూపమే!

ఇటువంటి పవిత్ర గణపతితత్త్వాన్ని మనము ఎందుకు పూజించాలి? మానవునకు నిత్య జీవితంలో అనేక విఘ్నములు ఎదురౌతూ వుంటాయి. అట్టి బాధలను, ఆటంకములను దూరముచేసి నిర్విఘ్నముగా కాపాడమని గణపతిని ప్రార్థిస్తూ వుంటారు. మొట్టమొదటి పూజ గణపతిది. ఎందుకీ గణపతికి ప్రథమస్థానమిచ్చారు? ఒకానొక సమయములో పార్వతి, ఈశ్వరుడు గణపతి గొప్పవాడా, సుబ్రహ్మణ్యం గొప్పవాడా అని నిర్ణయించటానికి ఒక ఉపాయము ఆలోచించారు. వారిద్దరిని కూర్చోబెట్టి "నాయనలారా! మీకు ఒక కార్యము నిస్తున్నాము. దానిని పూర్తి చేసుకురండి. మీరు దినదినానికి పెరుగుతూ పెరుగుతూ వస్తున్నారు. పెరిగే పిల్లలకు బాధ్యత నివ్వాలి. లేకపోతే తమోగుణము పెరిగిపోతుంది. ఈ ప్రకృతిని ఎవరైతే చుట్టుకొని వస్తారో వారికి ఒక ఆధిపత్యాన్ని యిస్తున్నాము" అన్నారు. ఈ మాట విన్న తక్షణమే సుబ్రహ్మణ్యం నెమలినెక్కాడు. లోకాన్నంతా చుట్టాలని నిర్ణయించాడు. అయితే, గణపతి ఒక్కడుగైనా ముందుకు వెయ్యలేదు. పార్వతీ పరమేశ్వరులు ఆశ్చర్యపోయారు. 'ఏమిటి! వీడు యిక్కడే వున్నాడు. సుబ్రహ్మణ్యానికే బహుమతి వస్తుంది, గణపతికి రాదని' అనుకున్నారు. చాలా అలసిపోయి సుబ్రహ్మణ్యం ప్రకృతిని చుట్టి వస్తుండగా దూరములో చూచి అమ్మానాన్నను ఒకసారి చుట్టి అక్కడే కూర్చున్నాడు, గణపతి. కారణమడిగినప్పుడు "ప్రకృతి అంతా భగవంతుని

sri sathyasai vahini vachanamrutam

స్వరూపమే! విశ్వం విష్ణు స్వరూపం. ఎప్పుడైతే నా తల్లితండ్రులకు ప్రదక్షిణ చేశానో అప్పుడు ప్రకృతి అంతా ప్రదక్షిణ చేసినవాడనౌతాను", అన్నాడు గణపతి. తండ్రియైన ఈశ్వరుని "మీరులేని స్థానమేదో నాకు చూపించండి" అని ప్రశ్నించాడు. ఇతని, తెలివితేటలను చూచి 'నాయనా! నీవు ప్రథమ పూజనందుకొందువు గాక!' అని గణాలకు నాయకుడుగా అతన్ని నియమించారు. ఈ విధంగా ప్రతిదానికి అంతరార్థములున్నాయి.

**రావణుని పది తలలు కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములు, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములకు ప్రతీకలు**

ఈ ఏనుగుతల ఎందుకు పెట్టారు? ఏనుగుతల మనిషికి పెడితే ఎంత వికారముగా వుంటుంది! కాని, గణపతి వికారముగా కనుపించడు. చాలా అందముగా కనుపిస్తాడు. ఇట్టి తెలివితేటలుగల తత్త్వమునకే, యిట్టి మేధాశక్తికే ఉన్నత స్థానము నందించారు. బాహ్య జీవితానికి, ప్రాకృతిక జీవితానికి ఈ మేధస్సును నిరూపించే నిమిత్తమై ఏనుగుతల గణపతికి యిచ్చారు. రావణునికి పది తలలు అన్నారు. పది తలలు ఎవరికైనా వుంటాయా? వుంటే హాస్యాస్పదముగా వుంటుంది. రావణుని పది తలలు కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములు, మనస్సు బుద్ధి, చిత్తం, అహంకారము. ఈ పది గుణములు కలిగినవాడు రావణుడు, అన్నారు. మానవుడు ఈనాడు తనలోని దోషములను తీసివేయుటకు ప్రయత్నించక పరులదోషములను వెతకటానికి ప్రయత్నిస్తున్నాడు. ముఖ్యముగా ఆధ్యాత్మికములో అహంకారమును దూరము చేసుకోవాలి. ఈ అహంకారము పెరుగుతున్నకొలది ఆశలుకూడా పెరుగుతుంటాయి. ఈ ఆశలకు అంతే లేదు. ఇట్టి ఆశలు పశు, పక్షి, మృగాదులకు లేవు. స్వార్థముగాని, ఆశగాని ఒక్క మానవునియందు మాత్రమే వృద్ధిపొందుతున్నది.

**ప్రేమచేత ప్రపంచమును ఒక్కటిగా చేయవచ్చు**

సిద్ధి వినాయకుడు, బుద్ధి వినాయకుడు అని మనము అంటుంటాము. ఈ సిద్ధి వినాయకుడు ఎక్కడ వుంటున్నాడు? మన బుద్ధియందే వుంటున్నాడు. మన బుద్ధి పెడమార్గము పట్టినప్పుడు యిది మనకు ఆపత్తును కలిగిస్తుంది. సక్రమమైన మార్గమును అనుసరించినప్పుడు సంతోషాన్ని యిస్తుంది. 'ఏ పనిచేసినా నేను మానవుడను, నేను మానవుడను అన్న విషయాన్ని

sri sathyasai vachanamrutam

గుర్తించుకొని చెయ్యాలి!' ఏదో కొన్ని పండుగలను మనము చేసుకుంటూ వస్తున్నాము. Sundayను holidayగా అనుభవిస్తూ వున్నాము. కాదు, కాదు హోలీడేగా అనుభవించాలి. భగవంతుని తత్వాన్ని మనము అర్థము చేసుకోలేము. అతని లీలలు అవాఙ్మనస గోచరములు. చిక్కిన దానిని దక్కించుకొని దానిని అనుభవించటానికి ప్రయత్నించటం మంచిది. అనవసరముగా మనము లేనిపోని వాదోపవాదములకు దిగి వున్న వివేకమును కూడా కోల్పోరాదు. అన్నింటికి ప్రధానమైనది ప్రేమయే! ఈ ప్రేమచేతనే ప్రపంచమును ఒక్కటిగా చేయవచ్చు. ప్రేమలేకపోవటంచేతనే ద్వేషము వస్తున్నది. ఈ ద్వేషము మానవత్వాన్ని నాశనం చేస్తుంది. ద్వేషాన్ని పెంచుకోటం చాలా కష్టము. ప్రేమను పెంచుకోటం చాలా సులభము. అతి సులభమైనదానిని విడిచిపెట్టి అతికష్టమైన దానిని సాధించటానికి ప్రయత్నిస్తున్నాము. సత్యము చెప్పటం చాలా సులభము. అసత్యము చెప్పాలంటే చాలా ప్లానులు వెయ్యాలి. చాలా శ్రమపడాలి. ఏదో బుద్ధి తప్పి అసత్యము చెప్పితే దానిని కప్పిపుచ్చటానికి పది అసత్యాలు చెప్పాలి. సత్యము చాలా సుఖమైనటువంటిది. 'సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్'. యిలాంటి సత్యస్వరూపమే దైవము.

**జగత్తునకంతా సత్యమే ఆధారము**

జగత్తునకంతా సత్యమే ఆధారము. ఈ సత్యము అవాఙ్మనస గోచరమైనది. దేశకాల పరిస్థితుల ప్రభావాలకు మించినటువంటిది. దీనినే 'ఋతం' అని వేదాంతము చెప్పింది. దీనినే transcendental truth అన్నారు. మూడుకాలములందు మారనటువంటిదే సత్యము. అట్టి సత్యాన్ని మనము ఆశ్రయించాలి. భగవంతుడు ఎక్కడ వుంటున్నాడంటే భగవంతుడు సర్వత్రా వుంటున్నాడు. 'పశ్యతీతి పశుః' అని వేదాంతము చెప్పింది. అనగా అర్థమేమిటి? నీవు చూచే ప్రతీదీ భగవంతుడే! నీవు ఆనందించేది ప్రతీది భగవత్స్వరూపమే! భగవంతునివల్ల కానటువంటిది ప్రపంచములో ఒక్కటీ లేదు. కనిపించే దృశ్యములన్నీ భగవంతునివే! అట్టి భావాన్ని మనము అభివృద్ధి పరచుకున్నప్పుడే ఆత్మతత్త్వము మనకు అర్థమవుతుంది. మొట్టమొదట దైవవిశ్వాసమును పెంచుకోవాలి.

ఈ జగత్తునందు నామములు వేరుగా వుండవచ్చును. ఒకరు 'రామ' అనవచ్చు, మరొకరు 'కృష్ణ' అనవచ్చు. పేర్లు వేరుగా వుండవచ్చు, కానీ దైవత్వము ఒక్కటే! ప్రతి మానవుడు



sri sathyasai vahini

దైవస్వరూపుడే! 'ఈశావాస్యమిదం సర్వం, వాసుదేవ స్సర్వమిదం'. అప్పుడే మానవునకు, మానవునకు మధ్యనున్న సంబంధ బాంధవ్యములు అభివృద్ధి చెందుతాయి. దైవమును విశ్వసించాలి, ధర్మాన్ని నడచుకోవాలి, సత్యాన్ని పాటించాలి. అప్పుడే మన జీవితము సార్థకమవుతుంది. నామ తత్త్వము అనేదానిని నీవు ఆధారము చేసుకోవద్దు. ఇది దైవత్వమన్న విశ్వాసాన్ని మనము పెంచుకోవాలి. దీనికి చిన్న ఉదాహరణము.

'నేను వెలుగులో వున్నాను. నేనే వెలుగు. వెలుగు నాలో వున్నది.' ఈ భావము మనకు రావాలి. నాలోన వెలుగు వున్నది. నేను వెలుగులో వున్నాను కనుక వెలుగు, నేను ఒక్కటే! నేను అనేది Love, వెలుగు అనేది Light. Love and Light యీ రెండింటి తత్వమే ప్రధానమైన తత్వము. ఈ లైటే జ్ఞానము. ప్రేమయే ఉపాసన.

**తల్లికంటె అత్యంత సమీపము, భగవంతుడు**

జ్ఞానముకంటె భక్తి చాలా వుత్తమమైనది. భక్తిని మనము సులభముగా అనుభవించవచ్చు. భగవంతుడు సులభప్రియుడు. భక్తికి మాత్రమే లొంగుతాడు. అదే ప్రేమ. అది లోపలనుండి వూరాలి. బయటనుండి కూరకూడదు. అవ్యాజ ప్రేమను మనము అభివృద్ధిపరచుకోవాలి. భగవంతుడు ఎక్కడవున్నాడని ప్రశ్నించినప్పుడు నా హృదయములో వున్నాడని అంటారు చాలామంది. చాలా తప్పు అది. భగవంతుడు నీలో వుంటే నీవు పెద్దవాడు, భగవంతుడు చిన్నవాడు అయిపోతాడు. ఈ వస్తువు నా చేతిలో వున్నదంటే ఈ చెయ్యిపెద్దది. ఈ వస్తువు చిన్నది. భగవంతుడు నీలో వున్నాడంటే నీవు పెద్దవాడవు. భగవంతుని యిముడ్చుకున్నవాడవు. అది సరియైన answer కాదు. నీవు, నేను, వారు అందరూ భగవంతునిలోనే వున్నాము. ఈ రహస్యాన్ని మనము అర్థం చేసుకోవాలి. భగవంతుని తత్త్వము 'అణోరణీయాన్ మహతోమహీయాన్' అణువులో అణువుగా వున్నాడు. మహత్తులో మహత్తుగా వున్నాడు. అందువలననే దైవాన్ని 'దూరాత్ దూరే అంతి కేచ', అని వేదము చెప్పింది. నీ మనస్సు భగవంతునకు ఎంతదూరముగా వున్నదో భగవంతుడుకూడా నీకు అంత దూరముగా వుంటాడు. నీ ప్రేమను అతి పవిత్రముగా మార్చుకొన్ననాడు భగవంతుడు నీకు అతి సన్నిహితుడైపోతాడు. తల్లికంటె అతిసమీపము, భగవంతుడు. మన తల్లియైనా దూరము కావచ్చుగాని భగవంతుడు

sri sathyasai vachanamrutam

దూరము కాదు. భగవంతుడు నిన్ను నిరంతరము చూస్తున్నాడని భావించరాదు. నేనే భగవంతునిలో వున్నాననే సద్భావమును అభివృద్ధి పరచుకోవాలి. ఆ విధమైన ఏకత్వాన్ని అభివృద్ధి పరచుకొని ప్రేమతత్వాన్ని పెంచుకున్నప్పుడే దైవత్వము మనకు అర్థమవుతుంది. పరమాత్ముని దినమంతా చింతించి, దినమంతా పరమాత్మ భావంలో అంకితము చేయటమే పర్వదినముల లక్ష్యము.

### భగవత్ప్రేమ చాలా పవిత్రమైనది

ప్రేమస్వరూపులారా! మీరంతా ప్రేమను అభివృద్ధి పరచుకోవాలి. ప్రేమ లేకపోతే పశువుకంటె హీనమైపోతాము. పశువుకైనా ప్రేమవున్నదిగాని మానవునకు స్వార్థమైన ప్రేమతప్ప విశాలమైన ప్రేమ కనుపించటం లేదు. స్వార్థమును విసర్జించి, పరార్థమును పెంచుకొని, యథార్థముగా జీవించి, జీవితమును సార్థకము చేసుకోవాలి. అనవసరమైన విషయాలలో ప్రవేశించటం మంచిదికాదు. నీ కర్తవ్యమును నీవు నిర్వర్తించు. తప్పక దైవమును చేరుతావు. భగవంతుడు అవతరించటము కేవలము కష్టములు, దుఃఖములు, విచారములు వీటిని తీర్చే నిమిత్తముగాదు. అవన్నీ నీ ప్రార్థనలే తీరుస్తాయి. భగవంతుడు వచ్చేది ప్రేమను అభివృద్ధి పరచే నిమిత్తమే. ప్రేమను పంచే నిమిత్తమై. కనుక ప్రేమమయుడైన భగవంతుడు ప్రేమను అందించటంకోసం వచ్చాడు. ఈ సత్యాన్ని మనము హృదయములో భద్రము చేసుకొని ప్రేమగా బ్రతికి అందరిలో సన్నిహిత సంబంధ బాంధవ్యాలను పెంచుకొని అందరిని ఆప్యాయముతో ఆదరించటానికి పూనుకోవాలి. ఇది మానవుని ప్రధానమైన కర్తవ్యము. ఎవరి మనస్సును మనము నొప్పించరాదు. కారణమేమనగా, ఆ నొప్పి మనము పదింతలుగా అనుభవించవలసివస్తుంది.

మంచి, చెడ్డలు రెండూ ఈ జగత్తులో వుంటున్నాయి. ఎట్టి భావమో, అట్టి ఫలితము. కనుక, మన భావాలను మొట్టమొదట పరిశుద్ధము చేసుకున్నప్పుడు మన జీవితమే మారిపోతుంది. కనుక, ప్రేమమయులు కండి! భగవత్ప్రేమ చాలా పవిత్రమైనది. ఆ ఒక్క ప్రేమను మనము అణుమాత్రము సంపాదించినా అఖండమైన ఆనందాన్ని అనుభవిస్తాము. మీ హృదయములో ప్రేమను అభివృద్ధి పరచుకోండి!

**(తేదీ. 15-09-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivachanamrutam